# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




## ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

వెంకటగిరి టౌన్, జూన్ 9, ప్రభాతవార్త



వెంకటగిరి పట్టణంలో హనుమాన్ శోభయాత్ర ఘనంగా జరిగింది. జై హనుమాన్ నామస్మ రణతో పట్టణ పురవీధు లు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ నుండి హనుమాన్ శోభాయాత్ర బయలుదేరి పట్టణ పురవీధుల్లో నిర్వహించారు. ఆంజనేయుడు శ్రీరాముడు వేషధారణలు అందరిని ఆకట్టుకున్నారు. హనుమాన్ సభ యాత్రలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్పి సూర్యనరాయణ రెడ్డి, సిఐ సంగమేశ్వర రావులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ పట్టణ ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వడ్లమూడి భాస్కర్, శ్రావణ్ కుమార్, లక్కమనేని కోటేశ్వర రావు, గుండు మనోజ్ కుమార్, రామకృష్ణ, గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల ఘాట్‌లో
# కూలిన వృక్షం

### నిమిషాల వ్యవధిలోనే తొలగించిన విజిలెన్స్ సిబ్బంది





తిరుమల, జూన్ 9ప్రభాతవార్తప్రతినిధి:

నైరుతి రుతువపనాల ప్రభావంతో నాలుగురోజులుగా కురుస్తున్న జోరువానలకు ఆదివారం మధ్యాహ్నాం రెండోఘాట్‌లో (అప్‌ఘాట్‌రోడ్డు) భారీ చెట్లు నేలకొరిగాయి. తిరుపతి నుండి తిరుమలకు వచ్చే ఘాట్‌రోడ్డులో లింకురోడ్డు దాటిన తరువాత మూడుకిలోమీటర్లు ముందు కురిసిన వర్షానికి చెట్లు కూలాయి.రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. సమాచారం అందుకున్న తిరుమల విఎస్ఓ నందకిశోర్, ఏవిఎస్ఓ ,అటవీశాఖ సిబ్బంది, విజిలెన్స్ సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకున్నారు. స్వయంగా వీరే రోడ్డుపై పడిన రాళ్ళు, చెట్లు కొమ్మలను తొలగించి క్లియర్ చేశారు.

## శ్రీకాళహస్వీశ్వరాలయంలో
# రూటు మార్చిన దళారులు

### ఎమ్మెల్యేకు పంపిన విజువల్స్, అధికారులపై సుధీర్‌రెడ్డి ఆగ్రహం

### టిక్కెట్లు కొన్నా కంచుగడప వరకే అనుమతి



శ్రీకాళహస్తి,జూన్ 9 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో పరిపాలనా సంస్కరణలకు నాలుగు రోజుల క్రితం శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఆలయంలో దళారులు కనబడరాదని, రాహుకేతుదోష నివారణ పూజా మండపాల్లో బలవంతపు వసూళ్ళు తగదని తట్టల్లో రేట్లు ఖరారు చేసి వసూళ్ళు చేయరాదని స్పష్టం చేసారు. ఈ మేరకు అధికారులు స్పందించారు.మూడు రోజుల పాటు దళారులను కట్టడి చేసారు. అయితే ఆలయంలో అల్పాదాయాలకు అలవాటు పడ్డ దళారులు, పూజారులు, అర్చకులు, వేదపండితులు తట్టుకోలేక పోతున్నారు. దాంతో దళారులు తమ సమయాలను మార్చుకున్నారు. వేకువ జాము నుంచి ఉదయం 7గంటల వరకే తమ సంపాదనలను సర్దుకుంటున్నట్లు కొందరు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి విజువల్స్ పంపినట్లు సమాచారం దాంతో ఆయన అధికారులపై సీరియస్ అయ్యారని తెలిసింది. దాంతో ఆదివారం సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం



రాహుకాల సమయం వరకు కంచుగడప వద్ద తిష్టవేసారు. భక్తులు టిక్కెట్లు కొనుగోలు చేసి వచ్చినా వారితో పాటు వచ్చే వారిని 'కంచుగడప వద్ద ఆపేస్తున్నారు.' టిక్కెట్లు చూపిన భక్తులనుమాత్రం ఆలయం లోపలకు అనుమతిస్తున్నారు.దాంతో రోజూ వేల రూపాయలను జేబులో వేసుకొని వెళ్ళె దళారి బాబులకు మింగుడు పడటం లేదు.దాంతో ఏ దారిలో వెళ్ళాలి?ఎవరి ద్వారా పైరవీలు సాగించాలనే దిశగా దళారులు యోచిస్తున్నారు.

**విచ్చలవిడిగా మారిన దళారులు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో గత కొంత కాలంగా దళారులు విచ్చలవిడిగా మారారు. రెగ్యూలర్ ఉద్యోగులను సైతం శాసించే స్థితికి చేరుకున్నారు. కొందరు దళారులు అయితే బోర్డు సభ్యుల పేరు చెప్పి రెగ్యూలర్ ఉద్యోగులను, హోం గార్డులను సెక్యూరిటిని శాసించే పరిస్థితి చోటు చేసుకుంది.వారిని కట్టడి చేసిన నాయకుడు లేదు.దాంతో వ్యవస్థ గాడితప్పింది. పరమ పవిత్ర పుణ్యక్షేత్రం దళారులు,అక్రమార్కులకు నిలయంగా మారింది.ఇక్కడకు వచ్చిన అధికారులు కూడా అధికార పార్టీ ఆదేశాలను తు.చ.తప్పక పాటించారేతప్ప వ్యవస్థను కాపాడాలనే దిశగా యోచించలేదు.దాంతో ఆలయంలో అడుగడుగునా దళారుల సామ్రాజ్యంగా మారింది. నేడు ప్రభుత్వం మారింది. పాలకులు మారారు. సంస్కరణలంటే ఉద్యోగులు, అధికారులకు మింగుడు పడటం లేదు. అయితే కొందరు అధికారులు మాత్రం హమ్మయ్యా!అంటూ ఊపిరి పీల్చుకుంటున్నారు.

## కన్నుల పండువగా
## భక్తాంజనేయ స్వామికి పుష్పాభిషేకం

చంద్రగిరి, జూన్ 9

ప్రభాతవార్త:



శ్రీవారిమెట్టు మార్గంలో వెలసియున్న శ్రీభక్తాంజనేయస్వామి వారికి ఆదివారం పుష్పాభిషేక మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. హనుమాన్ జయంతి అనంతరం స్వామి వారికి పుష్పాభిషేకం నిర్వహించడం సంప్రదాయంగా వస్తున్నది. ఇందులో భాగంగా స్వామి వారికి భక్తులు వివిధ రకాల సుగంధభరితమైన ఒక టన్ను పుష్పాలను కానుకగా అందజేశారు. ఆలయ అర్చకులు పుష్పాభిషేకం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## కాణిపాకం ఆలయానికి
# రూ.35 లక్షలు విరాళం



కాణిపాకం, జూన్ 9 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి పథకాలకు ఓ భక్తుడు ఆదివారం 35 లక్షల రూపాయల భారీ విరాళంను అందజేశారు. ఈమేరకు బెంగుళూరు బొమ్మనహళ్లికి చెందిన ఎ.గోపీనాధ్ అనే భక్తుడు దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నపథకానికి 20 లక్షల రూపాయలను డీడీ రూపంలో, శ్రీసిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు 15 లక్షల రూపాయలను చెక్ రూపంలోవిరాళంగా అందించారు. ఈమొత్తాన్ని దాత కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఈఓ వెంకటేశుకు అందజేశారు.దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, ఇన్స్‌పెక్టర్‌లు విఘ్నేష్, బాలాజినాయుడు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# శేషాచలంలో ఇంద్రధనస్సు




నైరుతిరుతుపవనాలతో కురిసిన జోరు వాన ఆగిన తరువాత శేషాచలంకొండలపై ఏర్పడిన ఇంద్రధనస్సు(ఏడు రంగులు) కనువిందుచేసింది. ఆకాశంలో అద్భుతంగా హరివిల్లు కనిపించి చూపరులకు ఆనందం కలిగించింది.

ప్రభాతవార్త-తిరుమల

## హెల్పర్ మృతదేహంతో కుటుంబీకులు.. గ్రామస్తుల నిరసన





## వేడుకగా శ్రీఅంకాలపరమేశ్వరి అమ్మవారి తిరుణాళ్ళు

4 లో

# సందిమంగళంలో విజృంభిస్తున్న డయేరియా!

## వృద్ధుడు, ఓ బాలిక మృతి



రాజగోపాల్ ఆచారి (ఫైల్‌ఫోటో)



భవ్యశ్రీ (ఫైల్‌ఫోటో)

పుత్తూరురూరల్, జూన్ 9 ప్రభాతవార్త:

పుత్తూరు మున్సిపాలిటీలోని నంది మంగళంలో డయేరియాతో ఓ చిన్నారి, వృద్ధుడు మృతి చెందారు. గ్రామస్థులు కథనం మేరకు... మున్సిపాలిటీ పరిధిలోని నందిమంగళం దళితవాడలో గత కొన్ని రోజులుగా డయేరియాలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 4న రాజగోపాల్ ఆచారి(70) మృతి చెందినట్లు తెలిపారు. తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ భవ్యశ్రీ(12) మృతి చెందినట్లు తెలిపారు. మరో 12 మంది వరకు నగరి, పుత్తూరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. ఈ విషయం తెలిసిన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తిరుపతి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో మాట్లాడి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి డయేరియాకు అదుపులోకి తీసుకుని రావాలని కోరారు.

దీంతో డాక్టర్ శ్రీహరి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షించారు. గ్రామంలో డయేరియా అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని ఆయన తెలియజేశారు. గ్రామాల్లో పూర్తిగా పైపులైన్లను మార్పు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.ఎల్.రెడ్డి తెలియజేశారు.

# అమలు కాని బాలకార్మిక చట్టాలు

## చితికి పోతున్న చిన్నారి బ్రతుకులు

వెంకటగిరి జూన్ 9 ప్రభాతవార్త:

ప్రభుత్వం పేద బాలకార్మిల అభ్యున్నతి కోసం కోట్లు రూపాయలు నిదులు హెచ్చిస్తు ఖర్చు చేస్తున్న అవి వారికి ధరికి చేరడం లేదన్న నగ్న సత ్యం. పట్టణ, గ్రామీణ ప్రాంతాలల్లో రోజు రోజుకి పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పేద బాలకార్మికులు సంఖ్య కూడా అధికంగా పెరుగుతుంది. అయితే ప్రభుత్వం అనే పథకాలు ప్రవేశ పెట్టి బాలకార్మిక వ్యవస్ధను రూపుమాపాలనే ఉద్దేశ్యంతో హెచ్చిస్తున్న నిధులు దుర్వినియోగం అవుతున్నాయి తప్ప అమలు మాత్రం కావడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వెంకటగిరి పట్ణణ. రూరల్‌గా ప్రాంతాల్లో ప్రతి నిత్యం బాలకార్మిలు చెత్తా కాగితాలు ఎరుకోని వాటిని విక్రయించుకోని తమ జీవనం సాగిస్తున్నారు. బాల కార్మికుల బతుకులు మాత్రం చితికి పోతన్నాయి. ఇప్పటికైన సంబంధిత ఉన్నతాధికారులు చోరవ తీసుకోని గ్రామీణ,పట్టణ ప్రాంతాలల్లో ఉన్న బాల కార్మికులను బడిలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, అందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్ధలు ముందుకు రావాల్సి న అవసరం ఎంతైనా ఉందని స్ధానికులు అంటున్నారు.



# మేమెందుకు రాజీనామా చేయాలి?!

## నామినేటెడ్ పోస్టుల రద్దుకు ఆదేశాలు ఖాతరు చేయని నాయకులు

శ్రీకాళహస్తి,జూన్ 9 ప్రభాతవార్త

కొత్త ప్రభుత్వం ఏర్పడనుంది. గతంలో వైకాపా అధికారంలో ఉన్నపుడు కొన్ని శాఖలకు సంబంధించి నామినేటెడ్ పదవులను అందించారు. అయితే కొత్తగా మెజారిటి సాధించిన తెలుగుదేశం ప్రభుత్వం ఇంకా ఏర్పడలేదు.అయితే అధికారులు నామినెటెడ్ పదవులకు సంబంధించి జివో జారి చేసారు.అయితే శ్రీకాళహస్తికి సంబంధించి నామినేటెడ్ పదవులు పొందిన వారు ' మేమెందుకు రాజీనామా' చేయాలనే విధంగా ఉన్నారు. శ్రీకాళహస్తినియోజకవర్గంలో ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాలను ఖాతరు చేయటం లేదు. ముఖ్యంగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలిని మార్చి 1 న(2024) పొడిగిస్తూ ఉత్తర్వులు జారి చేసారు.అప్పటికే కోడ్ వస్తుందనే సంకేతాలున్నా నియమించారు. గతంలో ఉన్న పాలకమండలి కన్నా రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మరికొందరిని కలిపినారు. వారితో పాటు ప్రత్యేకాహ్వానితులు సంఖ్య ఓ పాతికకు పెంచారు. పాలకమండలిని 2022 మార్చి 1న నియమించారు. వారి పదవికాలం 2 సంవత్సరాలు. వారి పదవి కాలం ఫిబ్రవరి 29,2024వరకు ఉండేది. అయితే నాయకుడు పొడిగించుకున్నారు.కొందరు సభ్యులు,ప్రత్యేకాహ్వానితులు రాజీనామాలు చేస్తున్నారు.కానీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు మాత్రం రాజీనామాలు చేయలేదు. మేమెందుకు రాజీనామా చేయాలని వాదిస్తున్నారు. ఇక మరో పదవి శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ తో పాటు సభ్యులున్నారు. వారు కూడా పదవులను వదలటానికి ఇష్టపడటం లేదు. ఈ పదవులు పోతే మళ్ళీ మన పరిస్థితి ఏమిటనే దిశగా ఉన్నారు.ప్రభుత్వ జివోలు మాకొక లెక్కా అన్నట్లు వ్యవహారిస్తున్నారు. ఈ అంశాలు చర్చనీయాంశంగా మారాయి.

# కాంగ్రెస్‌కు కలసి రాని ఒంటరిపోరాటం !



## -అభివృద్ధి ఎజెండా చూడని ఓటరు

తిరుపతి, జూన్ 9ప్రభాతవార్త:

ఆయనకు కాంగ్రెస్‌పార్టీలో సుదీర్ఘకాలం పనచేసిన అనుభవం...సీనియర్ నాయకుడు,మాజీ కేంద్రమంత్రిగా, పలు దఫాలు ఎంపిగా సేవలందించిన ఘనత డాక్టర్ చింతామోహన్‌ది. అయితే ఈ సారి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరుపతి ఎంపి అభ్యర్థిగా టిక్కెట్ దక్కించుకున్నా ఆయన ఒంటరిపోరాటం చేయడంతో ఉనికి చాటుకోలేకపోయారనేది జనంలో చర్చ. సార్వత్రిక ఎన్నికలకు ముందునుండే కాంగ్రెస్ పార్టీ తరపున తిరుపతి పార్లమెంట్ పరిధిలో తనదైన రీతిలో ప్రచారాన్ని మొదలుపెట్టారు. ప్రతి నియోజకవర్గంలో తనకంటూ ఉన్న ఓటర్లను, అభిమానులను కలవడం, వారితో మమేకమై ఆ ప్రాంతంలో గతంలో ఎంపిగా,కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి గురించి వివరించారు. అయినా ఆయనకు ఎన్నికల సమయంలో పార్టీ నేతలే కలసి నడవకపోవడంతో ఓటర్ల నుండి ఆదరణ కోల్పోవాల్సి వచ్చింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తిరుపతి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో 65,523ఓట్లు రావడం విశేషమే. అంత పట్టున్న సీనియర్ నాయకుడుకి పార్టీ నేతలు కలసి రాకపోవడంతో ఆయన మంచితనం, చేసిన అభివృద్ధి ఓటుబ్యాంకుగా మలచుకున్నారు. తిరుపతి నియోజకవర్గంతోబాటు శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆదరణ లేకపోయింది. పాతనాయకులు కొందరు కాంగ్రెస్ పార్టీని వీడి ఇతర పార్టీల్లో చేరారు. ఉన్న కొందరు నాయకులు పార్టీని ప్రాణంగా భావించి కొనసాగుతున్నా కలసి పనిచేయడంలో ఘోరంగా విఫలమయ్యారు.గత పదేళ్ళులో దేశంలో కాంగ్రెస్‌పార్టీ పరిస్థితి దారుణంగా తయారైందనే వైఫల్యం నుండి నత్తనడకన దక్షిణభారతదేశంలో గత ఏడాది జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి నుండి కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేజిక్చుకుంది. ఆ తరువాత మరో అడుగుముందుకేసి గత ఏడాది ఆఖరులో తెలంగాణారాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించి కాంగ్రెస్ పార్టీ గెలుపుతో అధికారాన్ని తొలిసారిగా తెలంగాణాలో పట్టుసాధించింది. ఇదే నమ్మకంతో ఆంధ్రలోనూ కాంగ్రెస్ పార్టీ మళ్ళీ ఉనికిని చాటుకోవాలనే ఆశయంతో కొందరు నేతలు ముందుకు కదిలారు. తిరుపతి పార్లమెంట్‌లోనూ కాంగ్రెస్ పార్టీని బ్రతికించుకుని,పూర్వవైభవం తీసుకువచ్చేందుకు మాజీ ఎంపి, మాజీ కేంద్రమంత్రి,తిరుపతికి చెందిన సీనియర్‌నేత డాక్టర్ చింతామోహన్ పార్టీ నాయకత్వాన్ని తన భుజాలపై మోశారు. ఎన్నికల సమయంలో తిరుపతిని రాజధాని నగరంగా మార్చాలని వినూత్న డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. ప్రజల నాడిని పట్టుకునేందుకు తనదైన రీతిలో యాత్ర సాగించారు.

## కార్మికులకు అండగా నిలిచి సమస్యలు పరిష్కరిస్తాం

– మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్



కుప్పం, జూన్ 9 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ పరిధిలో ఉన్న అసంఘటిత రంగా ల్లోని కార్మికులకు అండగా నిలిచి వారి సమస్యలను కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ ద్వారా పరిష్కరిస్తామని మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక చంద్రన్న కార్మిక భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పంలో ఆటోనగర్ ఏర్పాటు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే కార్మికులకు తెదేపా ప్రభుత్వం చంద్రన్న భీమా పథకాన్ని మరలా పునరుద్ధరిస్తుందని తెలిపారు. కార్మికుల కుటుంబాలకు అండగా నిలిచేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర నేత కాణిపాకం వెంకటేష్, వివిధ వర్గాల కార్మికులు పాల్గొన్నారు.

## మోడీ ప్రమాణస్వీకారంతో ఎన్డీయే నేతల సంబరాలు

కుప్పంరూరల్, జూన్ 9 ప్రభాతవార్త



దేశ ప్రధానిగా నరేంద్రమోడీ మూడోసారి ఆదివారం సాయంత్రం ప్రమాణస్వీకారం చేయడంతో కుప్పంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ శివశంకర్ అధ్వర్యంలో ఎన్డీయే పక్షాలైన తెదేపా, జనసేన, బిజెపి నేతలు, కార్యకర్తలు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. పెద్ద ఎత్తున టపాకాయలు కాల్చారు. ఈసందర్భంగా పేదలకు అన్నదానం నిర్వహించారు. ప్రధాని మోడీ నేతృత్వంలో భారతదేశం రానున్న ఐదేళ్లలో మరింత పురోగతి సాధిస్తుందని నేతలు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తులసినాథ్, జనసేన కోఆర్డినేటర్ డా॥ నరేష్, కౌన్సిలర్ సురేష్, మండల బిజెపి అధ్యక్షుడు వడివేలు, ఎంఎస్‌పి నాయకుడు దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డులో గుంతలు పూడ్చిన తెలుగుతమ్ముళ్లు

శాంతిపురం, జూన్ 9 ప్రభాతవార్త



మండల కేంద్రమైన శాంతిపురం – కెజిఎఫ్ రోడ్‌లో ఏర్పడిన గుంతలను ఎట్టకేలకు తెలుగుతమ్ముళ్లు సిమెంట్ కాంక్రీటు వేసి పూడ్చారు. వాహనదారుల ఇబ్బందులు గుర్తించిన టీమ్ విశ్వన్న సభ్యులు ఆదివారం గు ంతలను పూడ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, రాజు తదితరులు పాల్గొన్నారు. దేశం నేతల చొరవ పట్ల స్థానికులు అభినందించారు.

## తెదేపా మైనార్టీ నేతలకు సన్మానం

కుప్పం, జూన్ 9 ప్రభాతవార్త



రామకుప్పం మండలం బళ్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీ నేతలు భారీ ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. సిఎంగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టనుండడంతో పాటు తెలుగుదేశం పార్టీ మరలా అధికారంలో రావడం పట్ల వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఎన్డీయే కూటమికి రాష్ట్ర చరిత్రలోలేని విధంగా అత్యధిక స్వీట్లు రావడం పట్ల పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చారు. ఈసందర్భంగా నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు జాకీర్, సీనియర్ నేత ఫైరోజ్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మైనార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు : ఎస్కేఆర్

చౌడేపల్లి, జూన్ 9 ప్రభాతవార్త



ఎన్డీయే కూటమి తెలుగుదేశం ఆధ్వర్యంలో ఏర్పాటు అయ్యే నూతన ప్రభుత్వం ద్వారా రాష్ట్ర అభివృద్ధిలో పెను మార్పులు రానున్నాయని పురాతన దేవాలయాల పునర్నిర్మాణదాత, బోయకొండ మాజీ ఛైర్మన్ ఎస్.కె.వెంకట్రమణారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారి దర్శనానంతరం మాట్లాడుతూ కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిరంతరం శ్రామికుడన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాల గాడిలో పెట్టగల సామర్థ్యం ఆయనకుందన్నారు. దైవచింతన, ఆలయాల అభివృద్ధిని ఆకాంక్షించేవారికి ఛైర్మన్ పదవులు కట్టబెడితే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందన్నారు. నియోజకవర్గం, జిల్లా మంత్రుల సూచనల మేరకు పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఆలయాల ఆలనా పాలనా అబ్బుర పరచే స్థాయిలో వుంటుందన్నారు. ఊపిరున్నంత వరకు నారా చంద్రబాబునాయుడుకు బద్దుడుగా వుంటానన్నారు. తేదేపా నాయకులు బాలాజీ, జల్లి మనోహర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ సేవలో గువ్వల రమేష్‌రెడ్డి

చౌడేపల్లి, జూన్ 9 ప్రభాతవార్త



శక్తి స్వరూపిణీ బోయకొండ గంగమ్మను మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) దర్శించుకొన్నారు. ఆయన్ను అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి గంగమ్మ దర్శనభాగ్యం కల్పించారు. మండపంలో వేదాశీర్వాదం దుశ్శాలవాలతో సన్మానం, అమ్మవారి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. శ్రీధర్‌రాజు(గిరి) బోయకొండ సుబ్బు, నాగరాజరెడ్డి, కళ్యాణ్, రమణ, ఆమినిగుంట శంకర, డీజల్ మధు, ఎనమసానపల్లి నాగరాజరెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణానికి భంగం కల్గిస్తే చర్యలు : సిఐ

చౌడేపల్లి, జూన్ 9 ప్రభాతవార్త



రాజకీయపార్టీల నాయకులు ప్రశాంత వాతావరణానికి భంగం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని పుంగనూరు రూరల్ సిఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రతాపరెడ్డిలు అన్నారు. ఆదివారం పోలీసులతో వారు కవాతు నిర్వహించారు. ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. రాజకీయ పార్టీల నాయకులు సంవ్యవనం పాటించి, అసాంఘీక చర్యలకు దూరంగా వుండాలని హితవు పలికారు. బస్టాండు, బజారువీధి, నేతాజీనగర్ తదితర ప్రాంతాల్లో పోలీసు కవాతు నిర్వహించారు.

## ఘనంగా మోడీ ప్రమాణస్వీకార సంబరాలు

సదుం,జూన్ 8 ప్రభాతవార్త

దేశ ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ ఆదివారం రాత్రి ప్రమాణస్వీకారం చేయగానే సదుం బస్టాండులో తెలుగుదేశం నాయకులు, బీజేపీ నాయకులు,జనసేన నాయకులు కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి పెట్టారు. వారు నరేంద్రమోడీ జిందాబాద్, చంద్రబాబునాయుడు జిందాబాద్ అంటూ నినాదాలిచ్చారు. నరేంద్రమోడీ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలిచ్చారు. కార్యక్రమంలో తెదేపా ,బీజేపీ నాయకులు వై.వెంకటరమణారెడ్డి, కలికిరి హరిబాబు, వెంకటేశ్,ఆనంద్,మునిరెడ్డి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ చొరవతో అండర్ బ్రిడ్జి వద్ద నీరు తొలగింపు

కుప్పం, జూన్ 9 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ పరిధిలోని డికెపల్లి మార్గంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఇటీవల కురిసిన వర్షానికి అక్కడ నీరు భారీగా చేరి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీనిపై స్పందించిన కుప్పం మున్సిపల్ టిడిపి ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము మున్సిపల్ సిబ్బంది, రైల్వే సిబ్బంది సహకారంతో ఆదివారం విద్యుత్ సరఫరా లేకున్నా డీజిల్ మోటారు సాయంతో అండర్ బ్రిడ్జి వద్ద పేరుకుపోయిన నీటిని తోడించి సమస్యను పరిష్కరించారు. దీనిపై స్థానికులు హర్షం తెలిపారు.

## యుఎస్‌ఎలో తెలుగుమహిళల సంబరాలు

**రామకుప్పం, జూన్ 9 ప్రభాతవార్త** అమెరికా దేశంలోని వాషింగ్టన్ నగరంలో తెలుగు మహిళ నేతలు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ మరలా అధికారంలో రావడంతో రామకుప్పం మాజీ ఎంపిపి ఆంజనేయప్ప సతీమణి ప్రభావతి కుటుంబీకులు, ఇతర తెలుగు మహిళలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ 130స్థానాలు దక్కించుకోవడంఆనందంగాఉందన్నారు. చంద్రబాబునాయుడు సిఎంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పేద మహిళలకు స్వీట్లు పంపిణీ

చిత్తూరురూరల్, జూన్ 9 ప్రభాతవార్త:



చిత్తూరుపట్టణం, ఎంజిఆర్ వీధిలో వున్న అమ్మవారి ఆలయం ఎదుట ఆదివారం నరేంద్రమోదీ భారత ప్రధానమంత్రిగా మూడవసారి ప్రమాణస్వీకారం చేస్తున్న శుభతరుణాన్ని పురస్కరించుకొని చిత్తూరు సెంట్రల్ మండల అధ్యక్షుడు షణ్ముగం టెంకాయలను కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టపాకాయలను పేల్చుతూ డివిజన్ పరిధిలోని ప్రజలు, మహిళలకు స్వీట్స్ పంచిపెట్టారు. బిజెపి నాయకులు గోకుల్‌యాదవ్, ఆనంద్, పూతలపట్టు మండల అధ్యక్షుడు నరసింహన్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సైనికుల సంఘం నాయకుల నియామకం

పుంగనూరు,జూన్ 8 ప్రభాతవార్త





పుంగనూరు నియోజక వర్గ మాజీ సైనికుల సంఘంనూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. పట్టణంలో జరిగిన ఈ ఎన్నికలలో విశ్రాంత డీఎస్పీ మాజీ జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు కనుమకుంట సుకుమార్‌బాబును గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అదేవిధంగా అధ్యక్షులుగా సి.రెడ్డెప్ప, ఉపాధ్యక్షులుగా జవహర్,ప్రధాన కార్యదర్శిగా నానబాల ప్రతాప్,కోశాధికారిగా పార్థసారధి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సుకుమార్ బాబు మాట్లాడుతు నియోజక వర్గంలో తమ సంఘం తరపున ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ,సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

## ఎన్టీఆర్ విగ్రహాన్ని పున:ప్రతిష్టించడం అభినందనీయం

కాణిపాకం, జూన్ 9 ప్రభాతవార్త:

తెలుగుజాతి ఆత్మగౌరవం ఎన్టీఆర్ విగ్రహాన్ని పున: ప్రతిష్టించడం అభినందనీయమని జిల్లా జనసేన నాయకులు ఎం.మహేష్‌స్వేరో ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు నగర నడిబొడ్డున వున్న ఎన్టీఆర్ విగ్రహాన్ని గత ప్రభుత్వం అక్రమంగా తొలగించిందని తెలిపారు. తొలగించిన విగ్రహాన్ని జిల్లా టీడీపీ అధ్యక్షుడు సీఆర్.రాజన్, ఎమ్మెల్యేలు అమర్నాధరెడ్డి, మురళీమోహన్, పులివర్తి నాని, సీనియర్ నాయకులు దొరబాబుల ఆధ్వర్యంలో తిరిగి పున:ప్రతిష్టిచడం సంతోషంగానూ, గరవ్వంగానూ వుందన్నారు. దివంగత పార్టీ నాయకుల విగ్రహాలను పార్టీలు, రాజకీయాలకతీతంగా గౌరవించుకోవాల్సిన సంస్కృతి, బాధ్యత ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని మహేష్‌స్వేరో తెలిపారు.

## అన్నదానం

శ్రీకాళహస్తి,జూన్ 9 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని తేరువీదిలో ఆదివారం పేదలకు అన్నదానం జరిపారు. మంజునాథ్ గ్రూప్ హోటల్స్ యజమాని శ్రీనివాసులు జన్మదిన సందర్భంగా హోటల్ సిబ్బంది సంబరాలు జరిపుకున్నారు. పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో గత కొన్ని సంవత్సరాలుగా మంజునాథ్ హోటల్ పేరుతో శ్రీనివాసులు వ్యాపారం చేస్తున్నారు. ఇటీవల ఆలయానికి సమీపంలోని సన్నిధివీధిలో మరో బ్రాంచి ప్రారంభించారు. ఆయనకు తిరుపతి 5 హోటళ్ళు ఉన్నాయి. వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్న శ్రీనివాసులు జన్మదిన సందర్భంగా ఆయన సిబ్బంది పేదలకు అన్నదానం ఏర్పాటు చేసారు. దేవస్థానం సమాచార కేంద్రం కూడలిలో అన్నదానం ఏర్పాటు చేసారు. శ్రీనివాసులుచే కేక్ కట్ చేయించి సంబరాలు జరుపుకున్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

గూడూరు, జూన్ 9, ప్రభాతవార్త




గూడూరు పట్టణ పరిధిలోని హోసన్నా ప్రార్ధన మందిరంలో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ భావోద్వేగానికి లోనయ్యారు. గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్‌తో పాటు ఆయన సతీమణి సంధ్యారాణి ప్రార్ధనా మందిరంలో ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొని క్రిస్టియన్ సోదరులకు అభినందనలు తెలిపారు.

## విద్యుత్ తీగలు తెగిపడి గొర్రె మృతి

గూడూరు, జూన్ 9, ప్రభాతవార్త



గూడూరు పురపాలక పరిధిలోని పోటి పాలెం వద్దనున్న లెమన్ సిటీ లేఔట్‌లో విద్యుత్ తెగిపడి ఆదివారం గొర్రె మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు కరెంట్ ఏఈకి ఫోన్ ద్వారా పలుమార్లు స్థానికులు తెలియజేసేందుకు ప్రయత్నించగా ఇప్పటివరకు సంబంధిత అధికారి స్పందించలేదన్నారు. ఒకవేళ మనుషులే ఉంటే పరిస్థితి ఏందన్ విద్యుత్ శాఖ పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి తెగిపోయిన విద్యుత్ తీగలును పునరుద్ధరించి, మూగజీవాలు, ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుకుంటున్నారు.

## నల్లయ్యగారిపాలెంలో అన్నదానం

గూడూరు, జూన్ 9, ప్రభాతవార్త



సార్వత్రిక ఎన్నికల్లో డాక్టర్ పాశిం సునీల్ కుమార్ గూడూరు శాసన సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా చిల్లకూరు మండలం చేడిమాల గ్రామ పంచాయితీ నల్లయ్య గారిపాలెం గ్రామంలో అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి దాతలుగా సరుపూరు నాగేశ్వరరావు కొండేటి ప్రసన్న కుమార్‌లు వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అందరికీ సుపరిచితుడైన పాశిం సునీల్ కుమార్ ఎమ్మెల్యేగా అఖండ మెజారిటీతో విజయం సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వారు భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.

## 786 రఫీకి ఘన సన్మానం

నాయుడుపేట, జూన్ 9 ప్రభాతవార్త



నాయుడుపేట మున్సిపల్ వైస్ ఛైర్మన్, టిడిపి యువనేత 786 రఫీని పొగగొట్టం గిరిజన కాలనీ వాసులు ఘనంగా సన్మానించి సత్కరించారు. ఆదివారం 786 నివాసంలో రఫీని కలిసిన గిరిజన యువకుడు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 786 రఫీ సూళ్లూరుపేట కూటమి అభ్యర్థి నెలవల విజయశ్రీ గెలుపే లక్ష్యంగా విశేషంగా కృషి చేశారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి వారికి ఎల్లవేళలా అండగా నిలవడంతో పాటు ఆపద్బాంధవుడి పాత్ర పోషించిన ఆయనను ఈ సందర్భంగా సన్మానించడం సంతోషదాయకంగా ఉందని పేర్కొన్నారు.

## మేరిగను కలిసిన చెంచు పుట్టబాబు

చిట్టమూరు, జూన్ 9 ప్రభాతవార్త



ఎంఎల్‌సీ మేరిగ మురళీధర్‌ను ఆదివారం చిట్టమూరు మండలం కోతలగుంట గ్రామానికి చెందిన వైసీపీ నేత చెంచు పుట్టబాబు కలిశారు. గూడూరులోని మేరిగ నివాసంలో కలిసిన పుట్టబాబు మండల స్థాయిలో జరిగిన పోలింగ్ సరళిపై వివరించినట్లు తెలిపారు. నియోజకవర్గ వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా సైనికులు వాలంటీర్లకు అండగా ఉంటానని మేరిగ భరోసా ఇచ్చినట్లు పుట్టబాబు ఈ సందర్భంగా తెలిపారు. వైసీపీ పటిష్టత కోసం పుట్టబాబు కన్వీనర్ సన్నారెడ్డి ఆధ్వర్యంలో విశేషంగా కృషి చేసిన విషయం తెలిసిందే.

## మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్‌కు అభినందనలు

కోట, జూన్ 9 ప్రభాతవార్త



నెల్లూరు నగర మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్‌ను ఆదివారం కోట మండల ది ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు షేక్ అన్వర్‌బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు జిల్లాలోని అన్ని స్థానాల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయం సాధించడంపై అభినందించినట్లు అన్వర్‌బాషా తెలిపారు.

## సూళ్లూరుపేటలో రక్తదాన శిబిరం

సూళ్లూరుపేట, జూన్ 9 ప్రభాతవార్త



రక్తదాన మాసోత్సవాలను పురస్కరించుకొని సూళ్లూరుపేట సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు వారి సహకారంతో ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాతలు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శిబిరం నిర్వాహకులు షేక్ ఉస్మాన్‌బాషా, రెడ్‌క్రాస్ మోటివేటర్ మధుసూదన్‌రావు, వివిధ స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాజకీయ విద్వేషాలు లేని పాలన టిడిపికే సాధ్యం

– మండల టిడిపి అధ్యక్షుడు గణపర్తి కిషోర్‌నాయుడు



చిట్టమూరు, జూన్ 9 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాజకీయ విద్వేషాలు లేని పాలన ఉంటుందని ఆ పార్టీ చిట్టమూరు మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్‌నాయుడు తెలిపారు. రాష్ట్రంలో కూటమి, గూడూరులో పాశిం సునీల్‌కుమార్ ఘన విజయం సాధించడంపై చిట్టమూరులోని పార్టీ కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ విజయానికి అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో కొండేపాటి గంగాప్రసాద్ సూచనల మేరకు అభివృద్ధే అజెండాగా విద్వేషాలు లేని పాలన కొనసాగుతుందన్నారు. 12 న చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా చిట్టమూరు పార్టీ కార్యాలయం ఆవరణలో ప్రత్యక్ష ప్రసారం కోసం భారీ స్క్రీన్ ఏర్పాటు చేసి అన్నదాన కార్యక్రమాలు, విజయోత్సవ ర్యాలీ, బాణాసంచా వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామిరెడ్డి సునీల్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, గుండుబోయిన కస్తూరయ్య, నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, బిసిసెల్ మండల అధ్యక్షులు కాపులూరు చెంచురామయ్య ఆచారి, ఎస్సీ సెల్ అధ్యక్షులు కల్లూరు మణి, దొడ్డగ వెంకటరమణయ్య గుంపర్ల శ్రీనివాసులు, అంకయ్య, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి సంబరాలు

చిట్టమూరు మండలం కొత్తగుంట కూడలి ప్రాంతంలో బిజెపి మండల అధ్యక్షుడు దువ్వూరు శరత్‌చంద్రారెడ్డి ఆధ్వర్యంలో కూటమి నేతలు ప్రధానమంత్రిగా నరేంద్రమోడీ మూడోసారి ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

## బెదిరించి మోటార్‌బైక్ అపహరణ

తడ, జూన్ 9 ప్రభాతవార్త

తడ మండలం మాంబట్టు వద్దనున్న అపాచి షూ తయారీ కేంద్రం సమీపంలో కార్మికులను బెదిరించి మోటార్‌బైక్‌ను అపహరించినట్లు తడ పోలీసులకు ఫిర్యాదు అందింది. శనివారం రాత్రి షిఫ్ట్‌కు వెళుతున్న వరదయ్యపాలెం మండలం పులివెల్లం గ్రామానికి చెందిన మల్చి పరంధామ్ మోటార్‌బైక్‌లో మరో కార్మికుడు రవి కూడా ప్రయాణిస్తున్నాడు. జామాయిల్ తోట సమీపంలో ముగ్గురు అగంతకులు మోటార్‌బైక్‌ను ఆపి కత్తులతో బెదిరించి ఆ మోటార్‌బైక్‌ను అపహరించినట్లు బాధితులు పేర్కొన్నారు. సమీప గ్రామాల వారు కూడా రాత్రి చుట్టుపక్కల వెతికినప్పటికీ వారి జాడ కనిపించలేదని పేర్కొన్నారు. ఈ మేరకు తడ ఎస్ఐ నరసింహారావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## కోటలో ఈదురు గాలులతో వర్షం

కోట, జూన్ 9 ప్రభాతవార్త

కోట మండలంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. రోడ్లపై చెట్ల కొమ్మలు నేలకొరిగాయి. గాలులతో రేకుల షెడ్లు లేచిపోయాయి. ఇటీవల వరకు ఎండతో అల్లాడిన ప్రజలు వర్షాలతో సేదతీరుతున్నారు. ఈదురు గాలుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

## సత్రంలో వర్షం ...

దొరవారిసత్రం జూన్ 09 ప్రభాతవార్త;

మండలంలోని పలుగ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదుగాలిలు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది.నైరుతి రుతుపవనాల ప్రభావంతో గతవారం రోజుల నుండి వరుసగా తేలికపాటి వర్షాలు పడుతున్నాయి.ఈవర్షాలు కురవడంతో ఉష్ణోగ్రతలు క్రమేణ తగ్గుముఖం పడుతుడటంతో గ్రామీణ ప్రజలకు కొంతవరకు ఊరటనిస్తుంది.అంతేకాకుండ ఎడగారుసాగు చేపడుతున్న రైతులకు ఈవర్షం కొంతవరకు ఉపయోగపడుతుంది.వర్షాలకు పంటపొలాలు పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. ఉరుములు, ఈదుగాలులతో కూడిన వర్షాలు కురవడంతో గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.యుద్దపాతిపతికనవిద్యుత్‌శాఖఅధికారులు మరామ్మత్తులు చేపట్టి విద్యుత్‌ను యదావిదిగా అందించారు.

## లోకేష్‌ని కలిసిన పేరం వెంకటతేజ



నాయుడుపేట (పెళ్లకూరు), జూన్ 9 ప్రభాతవార్త

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి ఎమ్మెల్యేగా లోకేష్‌బాబు అత్యధిక మెజారిటీతో గెలుపొందడంతో విజయవాడలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పెళ్లకూరు మండల ఎన్‌ఆర్‌ఐ టిడిపి సెల్ అధ్యక్షులు పేరం వెంకటతేజ మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## బిజేపి ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు




గూడూరు, జూన్ 9, ప్రభాతవార్త

భారతదేశ ప్రధానిగా నరేంద్ర మోడీ మూడవసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయు సందర్భంగా గూడూరు పట్టణంలో భారతీయ జనతా పార్టీ అర్బన్ మండల పార్టీ అధ్యక్షులు బాలకృష్ణ నాయుడు, యువనాయకులు దయాకర్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక టవర్ క్లాక్ సెంటర్‌లో బాణాసంచా పేల్చి, సీట్లు పంచుకుని విజయోత్సవాలను నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల భవనంలో భారీ అన్నదానం కార్యక్రమాన్ని చేశారు. రాత్రి 7.15 నిమిషాలకు డిల్లీలో ప్రధానిగా నరేంద్రమోడీ ప్రమాణ స్వీకార సమయంలో పార్టీ ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయం వద్ద భారీగా బిజెపి నాయకులు, పార్టీ శ్రేణులు మధ్య నరేంద్ర మోడీ, జైజై నరేంద్ర మోడీ, జై బిజెపి అంటూ కేరింతలు నడుమ నిర్వహించిన సంబరాలు అంబరానంటాయి. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ కన్వీనర్ పురుషోత్తం రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు గిరిధర్ రెడ్డి, కోటారెడ్డి, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి గుంజి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు సురేష్, ఓబిసి మోర్చా అధ్యక్షులు కటికాల సురేష్, రావుల శ్రీనివాసులు, యువ మోర్చా నాయకులు మనోజ్, బిజెపి నాయకులు దాసరి వెంకటేశ్వర్లు, వినిష్ యాదవ్, చిట్టి, ప్రేమ్ సుందర్, శివ, జనసేన నాయకులు చంద్రనీల్, నయీం, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఐదేళ్ళ సమస్యకు పరిష్కారం

శ్రీకాళహస్తి, జూన్ 9 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో మొట్టమొదటి లే అవుట్ కాలనీ శ్రీరాం నగర్ కాలనీ. ఇక్కడ గత ఐదేళ్ళుగా పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారిందని శాసన సభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి మున్సిపల్ అధికారులకు సూచించారు. పట్టణ నడిబొడ్డులోని ఈ కాలనీలో అందరూ అధికారులే, ఉద్యోగస్తులే. అయితే ఇక్కడ పలు ఖాళీ స్థలాలు ఉండటం సరైన మురుగునీటి కాలువలు లేకపోవటంతో నివాసముంటున్న వారికి ఇబ్బందిగా మారింది. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పారిశుద్ధ్యంకు సంబంధించి మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబుతో ఎంఎల్ఏ చర్చించారు. వెంటనే స్పందించిన ఆయన శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులుతో సమీక్షించారు. ఆదివారం జెసిబిలను ఏర్పాటు చేసి ఖాళీ స్థలాలను శుభ్రపరచారు. ఈ ప్రాంత ప్రజలు మాట్లాడుతూ గత ఐదేళ్ళుగా ఇక్కడ ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. అంతేకాక పందుల నిలయంగా మారి ఇబ్బందిగా ఉందని స్థానిక ప్రజలు అభిప్రాయపడ్డారు. సమస్యను పరిష్కరించిన నాయకుడు బొజ్జల సుధీర్‌రెడ్డి, కమిషనర్ రమేష్‌బాబుకు కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.

## పానగల్ గంగమ్మ కమిటి నూతన కార్యవర్గం

శ్రీకాళహస్తి, జూన్ 9 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని పానగల్‌లో వెలసిన గంగమ్మ ఆలయ నూతన కమిటి ఎంపిక ఆదివారం జరిగింది. శ్రీకాళహస్తి పట్టణంలో ఏడు గంగమ్మలతో పాటు బహదూరపేట నల్లగంగమ్మ, బిపి ఆగ్రహారం గంగమ్మ, పానగల్ గంగమ్మ జాతరలను భారీ ఎత్తున నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో ఈ ఏడాది జాతరను 18,19తేదుల్లో నిర్వహించుటకు తీర్మానించారు. ఈ ఏడాది జాతరను ఎవరు నిర్వహించాలన్న మీమాంశలో యువకులు కొత్త కమిటిని ఏర్పాటు చేసి ఆ కమిటి సారధ్యంలో నిర్వహించుటకు తీర్మానించారు. ఈ మేరకు నూతన కమిటిని ఎన్నుకున్నారు. నూతన కమిటి నూతన గౌరవాధ్యక్షులుగా సత్రవాడ ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా అర్కాట్‌ముత్తు, జ్ఞానమ్మగారి సుబ్రమణ్యం అనే బుజ్జి (మేస్త్రీ) జయదేవన్‌గిరి, భాస్కర్‌గౌడ్ గంగమ్మకమిటి చైర్మెన్‌గా వేలూరు గుణశేఖర్ వైస్ చైర్మెన్‌గా జైకృష్ణయాదవ్, కోశాధికారిగా ఏ.మోహన్ గౌడ్, ప్రధానకార్యదర్శిగా ఎం.బాలమురుగన్, కార్యదర్శిగా జడపల్లి మునిశేఖర్‌గౌడ్, మునిసుబ్రమణ్యం, రూపేష్‌కుమార్ సభ్యులుగా పి.ఢిల్లి కుమార్, బి.బాబు, పి.గణేష్‌రాయల్, ఎస్.నవీన్‌కుమార్, కె. చందు కుమార్, దేవ, జి.బాబు, ఎన్‌లీలా మోహన్, టి.మోహన్, ఎం.యశ్వంత్ కుమార్‌లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. పానగల్ జాతరను ఈ నెల 11న చాటింపుతో శ్రీకారం చుడతామని తెలిపారు. ఈ నెల 18 రాత్రి గంగమ్మ ఊరేగింపు, 19న జాతర నిర్వహిస్తామన్నారు.

## బొజ్జల విజయం ప్రజా విజయం

శ్రీకాళహస్తి, జూన్ 9 ప్రభాతవార్త



బొజ్జలవిజయం ప్రజావిజయమని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి మరియు 22వ వార్డు యూనిట్ ఇన్‌ఛార్జి నెమళ్ళూరుసుబ్రమణ్యం(బుజ్జి) హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బుజ్జి మాట్లాడుతూ ప్రశాంతంగా జీవించే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రజల జీవితాలను అతలాకుతలం చేసి, నిత్యం దాడులు, దౌర్జన్యాలతో భయానక వాతావరణాన్ని కల్పించిన బియ్యపుమధుసూధనరెడ్డిని ఓడించి విజయం సాధించిన బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రజా విజయం అని తెలిపారు. పసుపురంగులు చల్లుకుని కార్యకర్తలు, నాయకులు సంబరాలు చేసుకున్నారు. దివంగతనేత నియోజకవర్గ అభివృద్ది ప్రధాత బొజ్జలగోపాలకృష్ణారెడ్డి బాటలోనే తనయుడు బొజ్జలసుధీర్‌రెడ్డి అభివృద్ది పనులు చేపడుతారని పేర్కొన్నారు. పార్టీ సీనియర్ నాయకులు లక్కమనేని మధుబాబు మాట్లాడుతూ నియోజకవర్గ ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి విజయంలో ఆయన సతీమణి బొజ్జలరిషితారెడ్డి పాత్ర ఎంతో కీలకమైందని, అద్వితీయమైందని వివరించారు. కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు డాక్టర్ యం.ఉమేష్‌రావు, మదనమోహన్, పూలశేఖర్, శివ, బాలయ్య, గురుమూర్తి, నాగమ్మ, సుబ్రమణ్యం, సులేమాన్, సురేష్, నున్నాగోపాల్, కోటయ్య, శేషయ్య, తేజ, ముని, కరుణాకర్, నంద, గణేష్, లోకేష్, శ్రీను, ప్రసాద్, సాలార్, సుధాకర్, మోహన్, చాంద్‌బాషా, సాదిక్ ఆలీ, కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బొజ్జలరిషిత జన్మదిన వేడుకలు

-అంబలిస్వామి ఆశ్రమంలో అన్నదానం

శ్రీకాళహస్తి, జూన్ 9 ప్రభాతవార్త

ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి పుట్టినరోజు సందర్భంగా పట్టణ తెలుగు యువత నాయకుడు వంకాయల సిద్దులయ్య ఆధ్వర్యంలో సన్నిధివీధిలో ఉన్న అంబలిస్వామి (సాధుస్వయంభువుస్వామి) ఆశ్రమంలో ఉన్న శివపార్వతుల విగ్రహాలకు ప్రత్యేకపూజలు, సుబ్రమణ్య స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి బొజ్జబ్రుందమ్మ, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్‌లు విచ్చేశారు. ముందుగా భారీ కేక్‌కట్‌చేసి చిన్నారులకు పంచిపెట్టడంతో పాటు ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గంగలపూడి హరి, బీమాల మునికృష్ణ, మునిరాజయాదవ్, బాలాజీరెడ్డి, జీవన్‌కుమార్, చిన్న, వాసు, రేణుకాదేవి, మల్లీశ్వరమ్మ, సుమతమ్మ, సునీతమ్మ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## కొమ్మనగుంటలో ఘనంగా రిషితారెడ్డి పుట్టినరోజు వేడుకలు

తొట్టంబేడు, జూన్ 9 ప్రభాతవార్త



మండలంలోని కొమ్మనగుంటలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఉన్నం.గోవర్ధన్ నాయుడు, మాజీ స్వర్ణముఖి ఆయకట్టు చైర్మన్, మరియు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అమరావతి, కన్నలి ప్రతాప్‌రెడ్డిల ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా అద్భుతమైన మెజారిటీతో గెలుపొందిన బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి నియోజకవర్గంలో అభివృద్దిని ముందుకు తీసుకెళ్ళాలని సూచించారు. అంతేకాకుండా ఆయన సతీమణి రిషితారెడ్డి పుట్టినరోజు సందర్భంగా గ్రామంలో భారీకేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. మాజీ ఎంపిటిసి విజయకుమార్, భాను, సాయి, వినోద్, నీరా, శ్రీకాళహస్తి పురపాలక సంఘ మాజీ కౌన్సిలర్ శెంజిగరం సుప్రజ పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## భూ ఆక్రమణలదారుల నుంచి స్మశాన స్థలాన్ని కాపాడండి

శ్రీకాళహస్తి, జూన్ 9 ప్రభాతవార్త

భూ ఆక్రమణదారుల నుంచి క్రైస్తవుల స్మశానస్థలాన్ని విడిపించాలని క్రైస్తవ ఆత్మగౌరవ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కమిటీ సైమన్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 20వేల మంది ఎస్సీ, ఎస్టీ, బిసి, కమ్మ, కాపు, బ్రాహ్మణ ఇతర కులాలకు సంబందించి క్రైస్తవులున్నారని వీరి అవసరాలకు అనుగుణంగా గత 18 సంవత్సరాల క్రితం పాలకులు అధికారులు క్రైస్తవ పెద్దల వినతి మేరకు సమాధులు చేయబడుతూ క్రైస్తవ సమాజం కోసం యొక్క స్వాధీనంలో ఉండేదని అయితే గత ప్రభుత్వం పెద్దల సహకారంతో కొంతమంది కబ్జాదారులు 2023 మార్చి నెలలో సుమారు ఎకరా స్థలాన్ని ఆక్రమించి గోడకట్టేసి గేట్లు కూడా పెట్టారని ఈవిషయాన్ని పలుమార్లు స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందించినా, గతంలో ఉన్న ఎంఎల్ఏ మధుసూధనరెడ్డికి తెలియజేసినా ఎలాంటి న్యాయం జరగకపోగా అధికారులు, పాలకుల అండదండలతో మరికొంతమంది కబ్జాదారులు మిగిలి ఉన్న స్థలంలో ఆక్రమించేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని ఎన్నికల ముందు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డికి విన్నవించామని తాను గెలిచిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ప్రస్తుతం తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. సైమన్‌శ్రీనివాస్, సభ్యులు చేమూరు రవికుమార్‌రెడ్డి, చంద్రశేఖర్, అశోక్, చంద్ర పాల్గొన్నారు.

## డివైడర్ విద్యుత్ స్థంభాలపై ఫ్లెక్సీలు: వాహన చోదకులకు ఇక్కట్లు

శ్రీకాళహస్తి, జూన్ 9 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఫ్లెక్సీల మోజు పెరిగింది. గతంలో స్థానిక శాసనసభ్యుడుగా, మంత్రిగా ఉన్న బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హాయాంలో పుణ్యక్షేత్రంలో ఎలాంటి ఫ్లెక్సీలకు అవకాశం లేకుండా నిర్ణయం తీసుకున్నారు. నాలుగుమాడావీధుల్లో ఈ వాతావరణం ఉండకూడదని కౌన్సిల్‌లో తీర్మానం కూడా చేసి అమలు చేసారు. అయితే గత కొంత కాలంగా ఓ వైపు రాజకీయ నాయకులు, మరో వైపు వివిధ వ్యాపార సంస్థలు విద్యుత్ స్థంభాలకు కూడలి ప్రాంతాల్లో అవతలివైపు దారి కనబడకుండా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. దాంతో మలుపుల వద్ద దారి కనబడటం లేదు. దాంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా స్వర్ణముఖి నది నుంచి పానగల్ ఎపిసీడ్స్ సర్కిల్ వరకు గల డివైడర్స్‌లోని విద్యుత్ స్థంభాలపై ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ ముఖ్యంగా జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, పొన్నాలమ్మగుడి, ఎపిసిడ్స్ సర్కిల్స్ వద్ద మలుపులున్నాయి. ఇక్కడ ఫ్లెక్సీలతో అవతలవైపు ఏ వాహనాలు వస్తున్నాయో తెలియకుండా ఇబ్బంది పడుతున్నారు. ఇక కొత్తపేట కూడలిలోని వినాయక ఆలయం వద్ద చౌరాస్తా. ఇక్కడ కూడా దారికడ్డంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో కూడా ప్రస్తుత కమిషనర్ రమేషబాబుకు ఇక్కడ ఫెక్సీలను నిషేధించాలని సూచనలందాయి. కానీ ఎందుకో అధికారులు చొరవ తీసుకోలేకపోతున్నారు. నిబంధనలను అమలుచేయలేక పోతున్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారి చేయాలని కోరుతున్నారు.

## కేవీబీ పురంలో ఎమ్మెల్యే ఆదిమూలంకు ఘన స్వాగతం

కేవీబీ పురం, జూన్ 9 ప్రభాతవార్త:



మండల కేంద్రమైన కేవీబీ పురంలో ఆదివారం సత్యవేడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ తరపున అత్యధిక మెజారిటీ గెలుపొందినందుకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు భారీ టపాకాయలతో పూలమాలలతో, బ్యాండ్ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో బి.రామాంజులనాయుడు, గోపినాథ్‌రెడ్డి, తెరణి జయరాంరెడ్డి, తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏ.పరందామిరెడ్డి, మునస్వామి యాదవ్, ఏ.శివరావు, మాజీ సర్పంచ్ భారతి, చెంగారెడ్డి, మునికృష్ణారెడ్డి, ఏ.సురేష్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ సర్పంచ్ రాయపేడు పన్నూరు బాలాజీ, తిమ్మ సముద్రం, సర్పంచ్ ఎర్రం దొరబాబునాయుడు, మహిళా మండల అధ్యక్షురాలు పావని, వరలక్ష్మి, కందస్వామి, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసేన పార్టీ కార్యకర్తలు, బీజేపీ అధ్యక్షుడు మునిశేఖర్, వాసు, వెంకట సుబ్బయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పుత్తూరులో బీజేపీ సంబరాలు

పుత్తూరురూరల్, జూన్ 9 ప్రభాతవార్త:

భారతీయ జనతా పార్టీ ఎన్‌డీఏ కూటమి మూడో సారి ప్రధాన మంత్రి మోదీని ఏకగ్రీవంగా ఎన్నుకోబడింది. ఈ కార్యక్రమాన్ని నగరి నియోజకవర్గ అంసెబ్లీ కన్వీనర్ స్థానిక పుత్తూరు నియోజకవర్గ ఆఫీసులో సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాలో అసెంబ్లీ కన్వీనర్ కె.ఇన్.హరిబాబు మాట్లాడుతూ ప్రపంచ దేశాలు భారతదేశంపై ఎదురు చూస్తున్నట్లు మోదీ ఉన్నత స్థానాన్ని తీసుకెళ్లారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి ప్రభంజనం చూపించారు. రాష్ట్ర ఎన్‌డీఏ కూటమికి భారతదేశ కూటమికి ధన్యవాదాలు తెలుపుకుంటూ హర్షం వ్యక్తం చేశారు.

## నగరిలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు సంబరాలు

నగరి, జూన్ 9 ప్రభాతవార్త:



భారతీయ జనతా పార్టీ ఎన్‌డీఏ కూటమి మూడో సారి ప్రధాన మంత్రి మోదీని ఏకగ్రీ వంగా ఎన్నుకున్న సందర్భంగా నగరిలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఘనం గా సంబరాలు చేసుకున్నారు కార్యక్రమంలో పొన్నప్పన్, సౌందర్య, పాండియన్, రాము, రాముకుమార్, నారాయణ, మనీవనం, శ్రీనివాసం, జనసేన మెరుపుల మహేష్, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, జిల్లా అధికార ప్రతినిధి జ్యోతినాయుడు, నాయకులు దేవ, సోము, గోపి, శేఖర్, అభిమానులు పాల్గొన్నారు.

## గిరిజనులకు దుప్పట్లు పంపిణి

ఏర్పేడు, జూన్9, ప్రభాతవార్త;



రేణిగుంట మండలంలోని చేయూత సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని గోవిందవరం ఎస్టీ కాలనీ వాసులకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సొసైటీ అధ్యక్షులు ప్రత్యూష మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా చేయూత సోషియల్ సర్వీస్ సొసైటీ సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. పేదరిక నిర్మూలను విద్యతోనే సాధ్యమని పేర్కొన్నారు. గిరిజన ప్రాంత మహిళలు తమ పిల్లలను పాఠశాలకు పంపించాలని కోరారు. చేయూత సోషల్ సర్వీస్ సొసైటీ కార్యదర్శి శ్రీనివాసులు, బ్యాంకు మిత్ర భాగ్యమ్మ, బాబునాయుడు, భాస్కర్, శీను, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

## పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులకు నిరంతర వైద్య విద్య కార్యక్రమం

తిరుపతి హెల్త్, జూన్ 9, ప్రభాతవార్త





ఎస్వీ వైద్య కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు నిరంతర వైద్య విద్య కార్యక్రమం ఆదివారం అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్, పోస్ట గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థుల కొరకు జోనల్ నిరంతర వైద్య విద్య కార్యక్రమం నేషనల్ మెడికల్ కమిషన్, రాష్ట్ర వైద్య విద్య సంచాలకుల ఆదేశాల మేరకు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కుప్పం పిఈఎస్ వైద్య కళాశాల, కడప నుంచి ఫాతిమా వైద్య కళాశాల, చిత్తూరు నుంచి అపోలో వైద్య కళాశాలలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పిఏ చంద్రశేఖరన్ మాట్లాడుతూ ప్రసూతి విభాగ పీజీ వైద్య విద్యార్థులకు ఇలాంటి నిరంతర వైద్య విద్య కార్యక్రమంలో పాల్గొనడం వల్ల గర్భం దాల్చిన స్త్రీలకు, ప్రసవించే సమయంలో కలుగుతున్న పలు ఇబ్బందులను, గురించి తెలుసుకుని వారికి అందించవల్సిన మెరుగైన వైద్యం గురించి, ఇందులో చర్చ సమావేశం నిర్వహించారు. అందుకు కావాల్సిన నైపుణ్యాన్ని పలు వైద్య కళాశాల నుంచి వచ్చిన పీజీ వైద్య విద్యార్థులు, ప్రసూతి విభాగ వైద్యులు సూచనలు సందేహాలను నివృర్తించుకొని, పేద రోగులకు మెరుగైన వైద్యం అందించడానికి నిరంతర వైద్య విద్య కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. రవిప్రభు, ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారధి రెడ్డి, ప్రసూతి విభాగాధిపతి డాక్టర్ ప్రమీలదేవి, ఎస్వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ (పరిపాలన), డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సత్యనారాయణ మూర్తి అకాడమిక్ (పోస్ట్ గ్రాడ్యుయేట్స్), డాక్టర్ సాయి వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## పుత్తూరులో ఘనంగా ముద్దన్న 77వ జయంతి

పుత్తూరురూరల్, జూన్ 9 ప్రభాతవార్త:



తెలుగునేల ఉన్నంత కాలం ముద్దన్నను మరచిపోలేమని పుత్తూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు పేర్కొన్నారు. పుత్తూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ముద్దన్న 77వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి టీడీపీ, జనసేన కార్యకర్తలకు, ముద్దన్న అభిమానులకు పంచి పెట్టారు. టీడీపీ, జనసేన కుటుంబసభ్యులు, ముద్దన్న అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా గాలి ముద్దుకృష్ణమనాయుడు జయింతి

నింద్ర, జూన్ 9 ప్రభాతవార్త :



మాజీ మంత్రివర్యులు గాలి ముద్దుకృష్ణమ నాయుడు 77వ జయింతి ఆదివారం మండల కేంద్రంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అబిమానులు మధ్య ఘనంగా జరగింది .ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ గాలి ముద్దుకృష్ణమనాయుడు పేదలకు అండగా వుండి ప్రతి ఒక్కరిని ఆదుకున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి కార్యదర్శి విజయకుమార్, వేంకటేశ్వర్లుచౌదిరి, నాయకులు సంపూర్ణమ్మ, మురళీనాయుడు, కోటీశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

## సమిష్టి కృషితోనే పులివర్తి నాని భారీ మెజార్టీతో గెలుపు

- సన్మానంలో సివిల్ సప్లయ్స్ మాజీ చైర్మెన్ సైకం

తిరుపతిరూరల్, జూన్ 9 ప్రభాతవార్త:



చంద్రగిరి నియోజకవర్గంలోని నాయకులు, ప్రజలు, కార్యకర్తల సమిష్టి కృషితోనే పులివర్తి నానికి భారీ మెజార్టీ లభించిందని రాష్ట్ర సివిల్ సప్లయ్స్ మాజీ చైర్మెన్ సైకం జయచంద్రారెడ్డి అన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని గెలుపుకు కృషి చేసిన సైకం జయచంద్రారెడ్డిని ఆదివారం ధనలక్ష్మీనగర్‌కు చెందిన టిడిపి నాయకులు ఘనంగా సత్కరించారు. టిడిపి సీనియర్ నేత సైకం జయచంద్రారెడ్డి సూచనలు, సలహాలు పార్టీ గెలుపుకు సహకరించడమే కాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సైకం అనుచరులు నాని గెలుపు కృషి చేసారని చెప్పడంలో అతిశయోక్తి లేదని తెలిపారు. టిడిపి శ్రేణులలో అధైర్యాన్ని పారద్రోలుతూ నూతన ఉత్సాహాన్ని నింపుతూ కేడర్‌ను బలోపేతం చేసారని తెలిపారు. టిడిపి పార్టీలో సైకం లాంటి సీనియర్ రాజకీయ ఉద్దండులు ఉన్నన్నిరోజులు పార్టీ పటిష్టంగా ఉంటుందని గర్వంగా తెలిపారు.

# తిరుపతి డివిజన్

## టీడీపీ విజయానికి యువత, మహిళలే కీలకం - చినబాబు

విజయపురం, జూన్ 9 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ విజయంలో ప్రధానంగా యువత, మహిళలే కీలకమని టీడీపీ చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబు పేర్కొన్నారు. మండలంలోనే విజయపురం పోలింగ్ బూత్ పరిధిలో టీడీపీకి 411 ఓట్ల ఆధిక్యత రావడానికి కృషి చేసిన యువతకు, మహిళలకు ఆదివారం విజయపురం మిట్టూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ పార్టీ నాయకులు శాలువలు కప్పి అభినందించారు. ఈ సందర్భంగా ఆ పరిధిలోని మహిళలకు పసుపు, కుంకుమ, జాకెట్, స్వీట్ ప్యాకెట్లు, అన్నదానం చేశారు. అలాగే మండలంలోని ముత్తప్పరెడ్డి కండ్రిగ, కమ్మకండ్రిగ, మహారాజపురం నారపరాజు కండ్రిగ గ్రామాల్లో కూడా నగరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాష్ విజయం తో పాటు రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి చుక్క ధనంజయయాదవ్, తెలుగు యువత మురళి, దిలీప్, భాగ్యేష్, కార్తీక్, దినేష్, గోవిందరాజులు, చంద్రబాబు, నాగరాజు, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, లోకేష్, డి.ఎస్.రాజు, బాబుయాదవ్, రవిచంద్రరెడ్డి, రాఘవరాజు, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ముద్దుకృష్ణమ సేవలు చిరస్మరణీయం

నగరి, జూన్ 9 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు సేవలు చిరస్మరణీయమని నగరి టీడీపీ నాయకులు కొనియాడారు. ముద్దుకృష్ణమనాయుడు 77వ జయంతి సందర్భంగా నగరిలో ఆదివారం ఆయన చిత్రపటా నికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏడు అడుగుల కొండల చిలువ పట్టివేత

నగరి, జూన్ 9 ప్రభాతవార్త:

నగరి నియోజకవర్గం దేశమ్మ గుడి వద్ద బైపాస్ రోడ్డులో దేవనాసపురం గ్రామంలో ఏడు అడుగుల కొండల చిలువను చూసి పట్టుకున్నారు. ఆ కొండ చిలువను అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

## కంటి ఆపరేషన్లకు 27 మంది ఎంపిక

వడమాలపేట, జూన్ 9 ప్రభాతవార్త:



తిరుపతి అరవింద కంటి ఆస్పత్రి సౌజన్యంతో వడమాలపేట సీహెచ్‌వో పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 27 శస్త్ర చికిత్సకు ఎంపికయ్యారు. ఆదివారం వడమాలపేట ఎంపీడీవో కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి సమస్య ఉన్న రోగులను పరీక్షించి మందులను, కంటి అద్దాలను అందజేశారు. శస్త్ర చికిత్సకు ఎంపికైన వారిని తిరుపతికి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని, వారిని తిరిగి వడమాలపేటకు తీసుకొచ్చి వదలడం జరుగుతుందని పురుషోత్తంరెడ్డి తెలిపారు. డా. హిమజ, పీఆర్‌వో గౌరిశంకర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## ముద్దుకృష్ణమ సేవలు చిరస్మరణీయం

వడమాలపేట, జూన్ 9 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు సేవలు చిరస్మరణీయమని చిత్తూరు పార్లమెంట్ పార్టీ అధికార ప్రతినిధి ధనంజయనాయుడు పేర్కొన్నారు. ముద్దుకృష్ణమ 77వ జయంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటాన్ని ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధనంజయనాయుడు, వెంకటయ్య, మోహన్, శివరాయల్, మురళి, శ్రీనివాసులు, వెంకటేశ్వరరావు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్ర పురోభివృద్ధి

టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కోరా హరిప్రసాద్

రామచంద్రాపురం, జూన్ 9 ప్రభాతవార్త:



టిడిపి జాయతీ అధ్యక్షుడు, కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర పురోభివృద్ధి సాధ్యమని టిడిపి చిత్తూరు జిల్లా కార్యనిర్వాహక కార్యనిహక కార్యదర్శి కోరా హరిప్రసాద్ అన్నారు. ఆదివారం రాయలచెరువు కట్ట క్రింద వెలసియున్న శ్రీ భవానీ శంకరాలయం నుండి పరమాల ధర్మరాజుల గుడి వరకు నాయకులు, కార్యకర్తలతో కలసి నిర్వహించతలపెట్టిన బైక్ ర్యాలీని టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి జెండావూపి ప్రారంభించారు. అనంతరం కోరా హరిప్రసాద్ మాట్లాడుతూ బిజెపి, జనసేన, టిడిపి క్యాడర్ సమిష్టి కృషితోనే కూటమి ఘన విజయం సాధించిందన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో 30 సంవత్సరాల చరిత్రను తిరగరాసి ఎంఎల్ఏ పులివర్తి నాని గెలిపించడం కార్యకర్తల కృషికి ఫలితమన్నారు. ప్రతి కార్యకర్తకు టిడిపిలో న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేంద్ర నాయుడు, మహేష్ నాయుడు, తులసిబాబు నాయుడు, ధనంజయ రాయల్, శేఖర్, చంద్రమౌళి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు

## జేఈఈ అడ్వాన్స్‌లో సత్తా చాటిన నారాయణ

తిరుపతి విద్య, జూన్ 9, ప్రభాతవార్త



నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) నిన్న విడుదల చేసిన జెఇఇ అడ్వాన్స్డ ఫలితాలలో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో ప్రభంజనం సృష్టించారని డిజిఎం కొండలరావు తెలిపారు. జ్యోష్మిత ఈడబ్ల్యూఎస్‌పి డబ్ల్యూ క్యాటగిరిలో ఆల్ ఇండియా 1వ ర్యాంకుతో పాటు ఓపెన్ కేటగిరిలో వివేకానంద 324, పుష్కర్ 886, శ్రీ వివస్వత్ 1008, దినేష్ ప్రసాద్ 1366 జస్వంత్ 1892, హితేష్ 2438, ప్రకాష్ 2617, మైత్రి శ్రీ 3338, ఆదిత్య నివాస్ 6938, బాలాజీ 7151, కిరణ్ కుమార్ 7480, వెంకటేష్ 8739, నాగశ్వేత 8754, జ్ఞాన తేజవర్మ 9024 వంటి ఓపెన్ కేటగిరి ర్యాంకులతో పాటు వివిధ కేటగిరిలలో 1,42,122, 174,409, 435, 453, 601, 773, 905 వంటి ర్యాంకులతో దాదాపు 50 మందికి పైగా ఐఐటి సీట్లు, 100 మందికి పైగా ఎన్ఐటి, ఐఐఐటి సీట్లు సాధించే అవకాశం ఉందని తెలిపారు. ఉత్తమ ఫలి తాలు సాధించిన విద్యార్థులను కోర్ డీన్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు ఫణీంద్ర చౌదరి, విజయ్ కుమార్, శ్రీనివాసరావు, చిట్టిబాబు, దుర్గాప్రసాద్, ఎజిఎం గోపిచంద్ అభినందించారు.

## ఐఐటి జేఈఈ అడ్వాన్స్ 2024లో శ్రీ చైతన్య ముందంజ

తిరుపతి విద్య, జూన్9, ప్రభాతవార్త



ప్రతిష్టాత్మక జేఈఈ అడ్వాన్స్ 2024 ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థులు ఆలిండియా వివిధ కేటగిరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి ర్యాంకులు కైవసం చేసుకున్నారు. ఈ రోహిత్ 384, వై లిఖిత్ 555, జి యశ్వంత్ సాయి 1024, ఏ గణేష్ కుమార్ రాజు 1862, టి. పవిత్ర 3028, ఏ సాయి తేజ 3157, కెపి మోక్షిత 3390, ఈ లక్ష్మణ్ 3678, టి వెనిక చౌదరి 3753, ఈ కుమార్ రెడ్డి 4929, పి. జిగ్నేస 7091, హే జీవన్ కుమార్ 7400, కె. శిరీష 7536, పి. పుష్పాంజలి 9281, జి. దివ్య కీర్త 9602 వంటి అత్యుత్తమ ర్యాంకులతో పాటు కోచించ్ తీసుకున్న విద్యార్థులలో అన్ని విభాగాలు కలిపి 58 మంది ప్రతిష్టాత్మక ఐఐటిలలో సీట్లు పొందగలిగే ర్యాంకులు సాధించారు. ఇంతటి అద్భుత ఫలితాలు సాధనకు ఉత్తమ అధ్యపక బృందముతో పాటు పటిష్ట విద్యా ప్రణాళికలు, పూర్తిస్థాయి ఐఐటి స్టడీమెటీరియల్సే కారణం అని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు సుష్మశ్రీ, నాగేంద్రలు అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి శ్రీ చైతన్య విద్యాసంస్థల కార్యనిర్వాహకులు ఎజిఎం బివి ప్రసాద్, అలాగే డీన్లు, కెఎల్‌జి ప్రసాద్, రామమోహన్ రావు, సంపత్ కుమార్, భాస్కర్లతో పాటు ప్రిన్సిపాల్స్ పాల్గొని ర్యాంకర్లనఉ అభినందించారు.

# కాణిపాకంలో కొనసాగుతున్న వేసవి రద్దీ / దర్శనానికి ఐదు గంటల సమయం


భక్తులతో కిటకిటలాడుతున్న కాణిపాకం ఆలయ క్యూలైన్లు

కాణిపాకం, జూన్ 9 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం ఆలయంలో ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగుతోంది. పాఠశాలలకు వేసవి సెలవులు మరో రెండు రోజుల్లో ముగుస్తున్న నేపథ్యంలో ఆదివారం కూడా అనూహ్యంగా తరలివచ్చిన భక్తులతో కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం రద్దీతో పోటెత్తింది. ఆలయంలో సాధారణంగా వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు శని,ఆదివారాలు ప్రభుత్వ సెలవు రోజులు కావడంతో పాటు ఈనెల 12 నుండి పాఠశాలలు పునః ప్రారంభం కానుండంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు అంచనాలకు మించి కాణిపాకం స్వామివారి దర్శనార్థం పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తాయి. ఆలయంలోని క్యూలైన్లతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో సుమారు నాలుగైదు గంటల వరకు వేచి

# చెంచుగుడి మహాభారతంలో ఘనంగా బండి కుంభాలు


భీమా ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వెదురుకుప్పం, జూన్ 9 ప్రభాతవార్త : మండలంలోని చెంచుగుడి మహాభారతంలో ఆదివారం ఘనంగా బండి కుంభాలు కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం భీమ పాత్ర దారితో పాటు భీమా ఉత్సవ మూర్తిని ఉభయదాత ఇంటి వద్దకు తీసుకు వెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహించి బండి కుంభంతో మహాభారత ఆలయ ప్రాంగణంకు రావడం జరిగింది. ఇతిహాస గాథలోని బకాసురుడు అనే రాక్షసుడు గ్రామాల మీదపడి విచ్చలవిడిగా ప్రజల ప్రాణాలు బలితీసుకుంటూ ఉండేవాడు ఐతే ఇలాంటి పరిస్థితి నుంచి అధికమించడం కొరకు ప్రజలు రాక్షసుడుతో ఒప్పందం కుదుర్చుకుని రోజు ఒక ఇంటి వారు బండి అన్నం, దున్నపోతును తీసుకు వెళ్ళి రాక్షసుడికి ఆహారం సమర్పించేవారని ప్రశస్త ఉంది. సమాచారం తెలుసుకుని బకాసురుని వధించడంకు భీముడు వెళ్లడం జరుగుతుంది. దీనిని పురస్కరించుకుని మహాభారతం పరిధిలోని గ్రామాల్లోని ప్రజలు బండి కుంభాలు తీసుకుని వచ్చి ఆలయం చుట్టు తిప్పి అమ్మవారి సమక్షంలో తీసుకు వచ్చిన అన్న ప్రసాదాలు నైవేద్యం సమర్పించి భక్తులకు పంచి పెట్టడం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఘట్టంను నాటక కళాకారులు రాత్రి వీధి నాటకములో పాటలు. పద్యాలు, అభినయంతో రక్తికట్టించి ప్రజల ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమంకు ఉభయదాతలుగా మిట్టపల్లె శారదమ్మ నారాయణ రెడ్డి కుమారుడు శ్రీధర్ రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రవి,కుమారస్వామి, మురగయ్య,రమేష్, గిరి,వాసు, నేతాజీ, బాలాజీ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# సూళ్లూరుపేటలో శ్రీహనుమాన్ శోభాయాత్ర



సూళ్లూరుపేట, జూన్ 9 ప్రభాతవార్త : విశ్వహిందూ పరిషత్ సూళ్లూరుపేట వారి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీబాలాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ చాలీసా అనంతరం శ్రీరామాలయం బ్రాహ్మణవీధి నుంచి హనుమాన్ శోభాయాత్ర అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ యాత్ర సాయినగర్‌లోని షిరిడీ సాయిబాబా మందిరం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు మురళీరెడ్డి, ఉపాధ్యక్షులు తమ్మిరెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలు సుంకర ప్రతిమ, గోపిక, కృష్ణారెడ్డి, ఉషా, నరేష్, శివప్రసాద్‌రెడ్డి, నారాయణరెడ్డి, దేవేంద్రరెడ్డి, ఎబివిపి, విహెచ్‌పి, భజరంగ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# హెల్పర్ మృత దేహంతో కుటుంబీకులు...గ్రామస్తుల నిరసన


మృతదేహంతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

కుప్పం, జూన్ 9 ప్రభాతవార్త : మండలంలోని అడవిబూదుగూరు పంచాయతీకి చెందిన హెల్పర్ ముత్తుకుమార్ (32) శనివారం మండలంలోని గుడ్లనాయనపల్లిలోని డిస్కం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన విషయం విదితమే. కాగా సమీపంలోని ఓ పరిశ్రమకు చెందిన వారు జనరేటర్ ఆన్ చేయడంతో విద్యుత్ సరఫరా రివర్స్ అయి ముత్తుకుమార్ మృతి చెందినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో సంబంధిత పరిశ్రమ నిర్వాహకులు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అడవి బూదుగూరు, కొటాలూరు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, కుటుంబీ కులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం సంబంధిత పరిశ్రమ నిర్వాహకులు మృతుడి కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు చెల్లిస్తామని పెద్దల సమక్షంలో అంగీకరించారని సమాచారం. కాగా ఆదివారం ఉదయం తమకు జరిగిన సంఘటనతో సంబంధం లేదని, తమ తప్పు లేకున్నా ఇలా డబ్బులు చెల్లించాలని తమపై ఒత్తిడి తేవడం తగదని పరిశ్రమ నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం ఆదివారం ఓ రెండు లక్షలు మిగతా మూడు లక్షలు మరికొంత సమయంలో అందించాలని అయితే తమకు పత్రం రాసి ఇవ్వాలని వారు పేర్కొనడంతో ఈ వ్యవహారం తెగేది కాదని భావించిన కుటుంబీకులు, ప్రజాప్రతినిధులు ఏకంగా ముత్తుకుమార్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో తీసుకొచ్చి స్థానిక టిబి రోడ్‌లో ఉన్న పరిశ్రమ నిర్వాహకుల దుకాణం ఎదుట ఉంచి నిరసన తెలిపారు. భారీ ఎత్తున మహిళలు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అక్కడకు చేరుకున్నారు. చివరకు మధ్యవర్తుల జోక్యంతో పరిశ్రమ నిర్వాహకులు బాధిత కుటుంబానికి ఐదు లక్షలు చెల్లించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై సుబ్బారెడ్డి గ్రామస్తులకు నచ్చజెప్పి పంపారు. అనంతరం మృతదేహాన్ని అడవిబూదుగూరుకు తీసుకెళ్లారు. దీంతో ఈ వివాదం పరిష్కారమైంది.

# జగనన్న ఆలయంలో విగ్రహాలు ధ్వంసం



శ్రీకాళహస్తి, జూన్ 9 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి సమీపంలోని రాజీవ్‌నగర్ వద్ద ఉన్న జగనన్న ఆలయం లో విగ్రహాలను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఆలయంకు ఉన్న తాళాలను పగులగొట్టి లోపల ఉన్న ఓ రైతన్న విగ్రహం, మరో వైపు ఓ మహిళ విగ్రహాన్ని ధ్వంసం చేయడంతో పాటు ఇక్కడ ఉన్న లైట్లను ధ్వంసం చేశారు. సుమారు రూ.48లక్షలతో ఎంతో ఆకర్షణీయంగా రూపొం దించిన జగనన్న ఆలయంను ధ్వంసం చేయడం శోచనీయమని పలువురు ప్రజలు పేర్కొంటున్నారు. ఆలయంలోపల ఉన్న పైభాగాన రావిచెట్టు ఆకులపై రూపొందించిన చిత్రాలు ఆకట్టుకోవడంతో పాటు జగనన్న ఆలయంలో పైన ఉన్న చిత్రాలను తొలగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. దీంతో మున్సిపల్ సిబ్బందితో ఆలయంలో ఉన్న చిత్రాలను తొలగించి మున్సిపల్ కార్యాలయానికి చేర్చారు. అంతేకాకుండా ఇక్కడ ఉన్న శిలాఫలకాలతో పాటు లైట్లను ధ్వంసం చేశారు. అయితే కొందరు మాత్రం ఈప్రాంతంలో వినాయకుని ఆలయం నిర్మించాలని కోరుతున్నారు. ఆలయంలో ఉన్న విగ్రహాలను ధ్వంసం చేయడంపై సిఐ రారాజును వివరణ కోరగా ఇప్పటి వరకు ఎవ్వరు ఫిర్యాదు చేయలేదని వివరించారు. కాగా ఆలయంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# ప్రజా సంక్షేమం కోసం కృషి చేసిన ముద్దుకృష్ణమ: గంజి మాధవయ్య



పుత్తూరు, జూన్ 9 ప్రభాతవార్త : ప్రజా సంక్షేమం కోసం తన జీవితాన్ని ధారపోసిన నాయకుడు దివంగత గాలి ముద్దుకృష్ణమనాయుడు అని తెలుగుదేశం పార్టీ పుత్తూరు రూరల్ క్లస్టర్ ఇన్‌ఛార్జ్, మాజీ ఎంపిపి గంజి మాధవయ్య తెలిపారు. ఆదివారం రూరల్ మండలం తొరూరు గ్రామంలో ముద్దుకృష్ణమనాయుడు 77వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముద్దుకృష్ణమ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనను నమ్ముకున్న వారి కోసం ముద్దుకృష్ణమ పోరాడేవారని కొనియాడారు. పుత్తూరు, నగరి నియోజకవర్గాల్లో ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని తెలిపారు. ఆయన వల్ల ఎన్నో కుటుంబాలు బాగుపడ్డాయని, తండ్రి బాటలోనే తనయుడు గాలి భానుప్రకాశ్ కనివినీ ఎరుగని రీతిలో 45 వేల ఓట్ల మెజార్టీతో గెలిచి ముద్దుకృష్ణమ వారసుడని నిరూపించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రూరల్ పార్టీ అధ్యక్షుడు డి.రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఎ.బాలాజీ, రూరల్ కుటుంబ సభ్యులు, ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.

# సిరి అలా వెళ్లకే చిత్ర షూటింగ్ ప్రారంభం



తిరుపతి హెల్త్, జూన్ 9, ప్రభాతవార్త : షీలోక్ ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై షీలా లోకనాథన్ నిర్మిస్తున్న హే సిరి అలా వెళ్లకే వెబ్ సిరీస్ చిత్రం ఆదివారం మానస సరోవర్ హోటల్ వద్ద ఘనంగా ప్రారంభమైంది. ఈ వెబ్ సీరియస్‌కు సంబంధించి వివరాలు తెలియజేశారు. రచయిత భరత్, దర్శకులు క్రిస్టోఫర్ మాట్లాడుతూ ఇది ఒక ప్రేమ కథ చిత్రం, ప్రేమ అనేది వయస్సుకు సంభించిందే కాదు, మనస్సుకు సంబంధించింది అనే విభిన్నమైన, కథాంశంతో సాగుతుందన్నారు. ఇందులో హాస్యము, భావద్వేగాలతో కూడిన సన్నివేశాలు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పెంచుతాయని తెలిపారు. ఇందులో హీరోగా సాయి, హీరోయిన్‌గా షీలా లోకనాథన్, ఇతర ముఖ్యపాత్రలో మోనికా రాజ్, కామెడిశాస్త్రి, వినుకొండ రవి, సుభాష్ చంద్రబోస్, గుర్రప్ప నాయుడు, భరణి కుమార్, బేబీ అభిజ్ఞ శోధన నటిస్తుండగా రచన భరత్, జి9 ఫిలిం ఫ్యాక్టరీ చిత్ర నిర్మాణ సంస్థ సహాయ సహకారాలతో ఈ సినిమా 32 రోజుల్లో తిరుపతి పరిసర ప్రాంతంలో జరుగుతుందని దర్శకులు, ఎడిటర్ క్రిస్టోఫర్ చెప్పారు.

# వైభవంగా అగ్నిగుండ ప్రవేశం



పుత్తూరురూరల్, జూన్ 9 ప్రభాతవార్త: పుత్తూరు మున్సిపల్ పరిధిలోని చిన్నబ్బనాయుడు కండ్రిగ గ్రామంలో వెలసిన గ్రామదేవత శ్రీ అంకాల పరమేశ్వరి అమ్మవారి తిరుణాళ్లు సందర్భంగా 3వ రోజు వైభవంగా అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరనలో చేశారు. అలాగే ఆలయ ఆవరణలో మహిళలు అధిక సంఖ్యలో హాజరై పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం బక్తులు వేపాకును చేత పట్టుకుని ఏడు బావులు స్నానమాచరించి అనంతరం పసుపు బట్టలు ధరించి భక్తులు అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమానికి భక్తులు హాజరై అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి గ్రామంలో పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు.

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

**-సూళ్ళూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ**



తిరుమల, జూన్ 9ప్రభాతవార్తప్రతినిధి: తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజలకు సేవచేసే బాగ్యం కలగడం సంతోషమని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. తనతండ్రి ప్రజాసేవలో చూపిన చొరవ తనకు ఆదర్శమన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ఆమె ఆదివారం ఉదయం తిరుమలకు చేరుకుని తండ్రి నెలవల సుబ్రమణ్యంతో కలసి విఐపి బ్రేక్ దర్శనంలో స్వామివారిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగ నాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# పూరీ శ్రీ జగన్నాథ నృత్యోత్సవంలో గూడూరు నృత్య విద్యార్థుల ప్రతిభ

**భారత్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో నృత్య గురువు పిండి మల్లిక, వెంకయ్యలకు సత్కారం**

గూడూరు, జూన్ 9 ప్రభాతవార్త : ఒరిస్సా రాష్ట్రంలోని పూరీ నగరంలో జరిగిన శ్రీ జగన్నాథ నృత్యోత్సవంలో గూడూరు శ్రీ శివ లలిత భరత నాట్య కళాక్షేత్రం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. భారత్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల నుంచి నృత్య కళాకారులు హాజరయ్యారు. గూడూరు శ్రీ శివలలిత భరత నాట్య కళాక్షేత్రం వ్యవస్థాపకులు పిండి మల్లిక, వెంకయ్యల ఆధ్వర్యంలో విద్యార్థులు ఒడిస్సా రాష్ట్రంలోని పూరీకి వెళ్లారు. ఆదివారం పూరీ నగరంలోని అన్నపూర్ణ రంగమాచార్య ఆడిటోరియంలో జరిగిన నృత్య పోటీలలో గూడూరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అందుకుగాను భారత్ ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపక అధ్యక్షులు లలితా రావు చేతుల మీదుగా పిండి మల్లిక, వెంకయ్యలను ఘనంగా సత్కరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలను, సర్టిఫికేట్లను ప్రధానం చేశారు. శ్రీ శివలలిత భరత నాట్య కళాక్షేత్రం విద్యార్థులు గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన నగరాలతో పాటు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రంలో భరత నాట్య ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం శ్రీ పూరీ జగన్నాథ స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. దేశ వ్యాప్తంగా ప్రదర్శనలు ఇస్తూ గూడూరుకు పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తున్న శ్రీ శివలలిత భరత నాట్య కళాక్షేత్రం విద్యార్థులను, వ్యవస్థాపకులు పిండి మల్లిక, వెంకయ్యలను పలువురు అభినందించారు.

# రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికీ గాయాలు



గూడూరు, జూన్ 9 ప్రభాతవార్త : గూడూరు రూరల్ మండల పరిధిలోని, ఇందిరమ్మ కాలనీ సమీపంలో రెండు బైకులు ఢీకొని ఇద్దరి వ్యక్తులకు గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు ఇందిరమ్మ కాలనీకి చెందిన నాగేంద్ర మోటారు బైక్ మీద గూడూరులో పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా అదే మార్గంలో నెల్లూరుకి చెంది ప్రవీణ్, నాగరాజు అనే ఇద్దరు వెడిచేర్ల నుండి నెల్లూరుకి బైక్ పై వెళ్తుండగా ఇదే క్రమంలో ఇందిరమ్మ కాలనీ వద్ద ఎదురుగా బైక్‌లు ఢీకొనడంతో గాయాలు పాలైయ్యారు. దీంతో 108 ద్వారా గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అనంతరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 80 వసంతాల వేడుకలకు సిద్ధమవుదాం

**ఎస్టీయు కార్యదర్శి మోహన్**

పుంగనూరు, జూన్ 9 ప్రభాతవార్త : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 80 వసంతాల వేడుకలకు



రాష్ట్రంలోని అన్ని ఎస్‌టీయూ అనుబంధ సంఘాలన్నీ ఇప్పటి నుంచి సిద్ధం కావాలని సంఘం జిల్లా కార్యదర్శి బి.మోహన్ కోరారు. ఆదివారం పుంగనూరులో ఎస్‌టీయూ 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 2026లో జరిగే 80 వసంతాల వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర శాఖకు ప్రతిపాదిస్తామన్నారు. స్వాతంత్రం రాక పూర్వమే నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకించి 1947లో ఆవిర్భవించిందని ఎంతో ఘన చరిత్ర కలిగిన ఎస్‌టీయూలో సభ్యులుగా ఉండటం ఉపాధ్యాయ, ఉద్యోగులకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు సాధనలో అలుపెరగని పోరాటం చేస్తూ రాష్ట్రంలోనే మొనగాడి సంఘంగా మన సంఘం నిలవడం ఎంతో గర్వకారణం అన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, ఆర్థిక బకాయిలు విడుదల చేసి, పిఆర్‌సీని ప్రకటించాలని 117 జివోను రద్దు చేసి విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావాలని కోరారు. చౌడేపల్లె, పుంగనూరు మండల మహిళా కన్వీనర్లు సుమిత్ర, దీపారాణి ,డివిజనల్ కన్వీనర్ నారాయణస్వామి, నాయకులు శ్రీధర్, మంజునాథ్,సుధాకర్,నరేంద్ర, శంకర్, శ్రీనివాసు శ్రీరాములురెడ్డి,వాదర్‌జాషా,రామకృష్ణ,కృష్ణమూర్తి, శ్రీనివాసులు, మదుసూధన్,సుమ తదితరులు పాల్గొన్నారు.

# శివయ్య సన్నిధిలో చిత్తూరు జిల్లా కలెక్టర్



శ్రీకాళహస్తి, జూన్ 9 ప్రభాతవార్త : ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వ రాలయ దేవస్థానానికి చిత్తూరు జిల్లా కలెక్టర్ షగిలిషణ్మోహన్ కుటుంబసభ్యులతో విచ్చేశారు. వీరికి ఆలయ డిఈఓ ఏకాంబరం దక్షిణగోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలో వెలసిన స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించుకున్నారు. అనంతరం వీరికి ఆలయంలోని దక్షిణామూర్తి సన్నిధి వద్దస్వామి అమ్మవార్ల చిత్రపటంతో పాటు వేదపండితుల ఆశీర్వచనాలను అందించి తీర్థప్రసా దాలను అందించారు. దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించిన వారిలో పిఆర్‌ఓ రవి మరియు ఆలయాధికారులు పాల్గొన్నారు.

# లాభాల బాటలో చామదుంప సాగు

**హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు**



వెంకటగిరి జూన్ 9ప్రభాతవార్త: గత సంవత్సరం కంటే ఈ ఏడాది చామదుంపల సాగు రైతు లకు అధికంగా లాభలు తెచ్చి పెట్టిందని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వెంకటగిరి మండలంలో లాలపేట, మొక్కల పాడు, మన్నేగుంట, కుర్జగుంట, బోప్పపూరం తదితర ప్రాంతాల్లో సుమారు 50 ఎకరాలల్లో చామదుంపల సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడలు వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. వ్యవసాయశాఖ సూచనలు సలహాలు మేరకు సాగు చేయడంతో అధిక దిగుబడులతో పాటు అధిక లాభాలు వస్తున్నట్లు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే గత ఏడాది అధిక దిగుబడి వచ్చిన కనీస గిట్టుబాటు ధరలు లేకపోవడంతో వ్యవసాయ సాగు పోలంలోనూ చామదుంప సాగు దున్ని వదిలి వేచినట్లు రైతులు తెలిపారు.గతంలో రైతులు చామసాగులో పూర్తిగా నష్టం వచ్చినట్లు తెలిపారు.ప్రస్తుతం చామదుంపలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో కేజి 30 నుంచి 40 రూపాయులు వరకు ఉండటంతో చామ దుంపలు బస్తా ధర 1200 నుంచి 1500 వరకు ఉండటంతో మంచి అదాయం లబిస్తుందని రైతులు అంటున్నారు.మండలంలో చామదుంప సాగు మొత్తం పరిపక్వదశలో ఉందని ఇదే విధంగా ధరలు ఉంటే చామదుంపులు సాగు చేసిన రైతులకు మంచి గిట్టుబాటు ధరలు ఉంటాయని అంటున్నారు.

# పులివర్తి నానికి వేద పండితులచే ఆశీర్వాదం



తిరుపతిరూరల్, జూన్ 9 ప్రభాతవార్త: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు సుపరిపాలన అందించాలని కోరుతూ టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యధర్శి బిరుదాల భాస్కర్‌రెడ్డి వేద పండితులచే ఆశీర్వాదం అందిం చారు. గత 30 సంవత్సరాలు తర్వాత చంద్రగిరి కోటపై టిడిపి జెండా ఎగరవేయడం జరిగిందని, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు నాని గెలుపుకు కృషి చేసారని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో వైకాపా నాయకులు అరా చకాలు, ఆక్రమణలు, అవినీతికి చరమగీతం పాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనంతశర్మ, వెంకటేష్ స్వామి, రాజీవ్‌స్వామి, బోస్‌స్వామి, కుషల్ స్వామి పాల్గొన్నారు.

# పల్లెల్లో శాసనసభ ఎన్నికల్లో... సైకిల్ జోరు!

కోట, జూన్ 9 ప్రభాతవార్త : స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టంకట్టిన పంచాయతీలు, సాధారణ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో తెలుగుదేశం పార్టీని గెలిపించాయి. వైసీపీ హయాంలో సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మారిపోవడంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదు. ఈ నేపథ్యంలో పల్లెల్లో ఓట్లు అత్యధికంగా తెలుగుదేశం పార్టీకే పడ్డాయి. గాంధీజీ కలలగన్న స్వరాజ్యాన్ని తీసుకొస్తామంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ నాయకులు ఊదరగొట్టారు. వీరి మాటలను నమ్మి అత్యధిక పంచాయతీలు వైసీపీకే కట్టబెట్టారు. కానీ వైసీపీ ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి వినియోగించాల్సిన ఆర్థిక సంఘం నిధులు పక్కదారి పట్టించింది. దీనికితోడు సర్పంచులకు ఉండాల్సిన కనీస అధికారాలు కూడా లేకుండా నిర్వీర్యం చేశారు. సర్పంచులు అప్పులు చేసి పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో పలువురు సర్పంచులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. కోట పట్టణంలో తెలుగుదేశం పార్టీ 1590 ఓట్ల ఆధిక్యత చాటుకుంది. మండలంలో 3600 ఓట్లు మెజారిటీని కైవసం చేసుకుంది.

# చేనేతపై జీవనాధారం- చేయూత నివ్వండి

**-అక్బర్‌నివాసకండ్రిగ గిరిజనులు**



వెంకటగిరి, జూన్ 9 ప్రభాతవార్త: మండలంలోని కుర్జగుంట పంచాయతీ లోని ఆక్బర్ నివాస కండ్రిగ గిరిజన కాలనీలో సుమారు 30 కుటుంబాలు కేవలం చేనేతపై జీవనం సాగిస్తున్నామని అయితే సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. చీరలు నేసుకొనేందుకు షెడ్‌లేక పూరి పాకల్లో చీరలు నేస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం వస్తే పనులు ఉండవని కుటుంబ సభ్యులు అందురు పస్తులు ఉండాల్సిన దుస్థితి దుస్తి నెలకొందని, ప్రభుత్వ చేనేత ఉన్నతాధికారులు ఆక్బర్ నివాస కండ్రిగ లోని నేత నేసే గిరిజనులను పూర్తిగా విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం నుంచి నేత కార్మికులకువచ్చే రాయతీలు కూడా అందడం లేదని వాపోయారు.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకోని ఆక్బర్ నివాస కండ్రిగ గిరిజనులలను అదుకోవాలని కోరుతున్నారు.